# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS


TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 04 ఏప్రిల్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 253

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ పచ్చజెండా



## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

విద్యార్థులకు అండగా ఉంటామన్న రఘునందన్



## థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన

బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ

# అతలాకుతలం

- రాష్ట్రవ్యాప్తంగా దంచికొట్టిన వాన
- వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి
- హైదరాబాద్‌లో వాగులుగా మారిన రహదారులు
- అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**అకాల వర్షం రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. గురువారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా ఈదురుగాలులతో ప్రారంభమై ఉరుములు, మెరుపులు, పిడుగుపాట్లతో వర్షం విరుచుకుపడటంతో జన జీవనం స్తంభించింది. ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణాల్లో భారీ వర్షం కురిసింది. హైదరాబాద్‌లో దాదాపు అన్ని డివిజన్లలో కురిసిన భారీ వర్షానికి నగర జీవనం అస్తవ్యస్తమైంది.**



హైదరాబాద్: అకాల వర్షం రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. గురువారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా ఈదురుగాలులతో ప్రారంభమై ఉరుములు, మెరుపులు, పిడుగుపాట్లతో వర్షం విరుచుకుపడటంతో జన జీవనం స్తంభించింది. ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణల్లో భారీ వర్షం కురిసింది. హైదరాబాద్‌లో దాదాపు అన్ని డివిజన్లలో కురిసిన భారీ వర్షానికి నగర జీవనం అస్తవ్యస్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా పిడుగుపాట్లు, గోడకూలిన ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. నడి వేసవిలో వణికిన హైదరాబాద్ భారీ వర్షం హైదరాబాద్‌ను ముంచెత్తింది. ఎల్బీనగర్ నుంచి మొదలు పంజాగుట్ట, అమీర్‌పేట.. ఉప్పల్ నుంచి తార్నాక, సికింద్రాబాద్.. నారాయణగూడ నుంచి రాష్ట్ర సచివాలయం, ఖైరతాబాద్ ప్రాంతాల్లో వరద నీటితో రహదారులు వాగుల్లా మారాయి. వాహనాల రాకపోకలు గంటలతరబడి నిలిచిపోయాయి. ఖైరతాబాద్, ఆనందనగర్, దిల్‌సుఖ్‌నగర్, రామ్‌నగర్‌లలో పలుచోట్ల చెట్లు కూలాయి. కొన్ని చోట్ల కార్లపై పడగా.. లోపల ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చెట్ల కొమ్మలు విరిగి పడడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు దెబ్బతిన్నాయి. మలక్‌పేట్ ఆర్‌యూబీ నడుములోతు నీటితో నిండింది. పలు వాహనాలు వరదలో చిక్కుకున్నాయి. సికింద్రాబాద్ అడ్డగుట్ట బస్తీలో మురుగునీటి కాలువ పొంగిపొర్లడంతో

ఇళ్లలోకి నీరు చేరింది. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద బుల్కాపూర్ నాలా రహదారిని

ముంచెత్తింది. కూడలిలో ఓ చెట్టు నేల కూలింది. ఉప్పల్


చౌరస్తా నుంచి రామంతపూర్ వైపు పలు ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

కలిగింది. రెండు గంటల పాటు వర్షం కురవడంతో నగరమంతా ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ, చలికి వణుకుతూ నరకాన్ని చవిచూశారు.



# హైకోర్టులో కేసు 7కు వాయిదా

**కంచ గచ్చిబౌలిలో చెట్ల నరికివేత పనులపై దాఖలైన పిటీషన్లపై విచారణను హైకోర్టు ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ భూమిని టీజీఐఐసీకి కేటాయిస్తూ ప్రభుత్వం గత ఏడాది జూన్ 26న జారీచేసిన జీవో54ను సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కె.బాబూరావు, వట ఫౌండేషన్‌లు వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశాయి.**



హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలో చెట్ల నరికివేత పనులపై దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ భూమిని టీజీఐఐసీకి కేటాయిస్తూ ప్రభుత్వం గత ఏడాది జూన్ 26న జారీచేసిన జీవో54ను సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కె.బాబూరావు, వట ఫౌండేషన్‌లు వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశాయి. గురువారం భోజన విరామ సమయంలో విచారణ చేపట్టాలంటూ హెచ్‌సీయూకి చెందిన విద్యార్థులతోపాటు మరొకరు తాజాగా మరో 2 పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం గురువారం మధ్యాహ్నం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై హైకోర్టు రిజిస్ట్రీ నుంచి నివేదిక కోరిందని తెలిపారు. గతంలో ఇదే హైకోర్టు 7వ తేదీ వరకు కౌంటరు దాఖలు చేయడానికి గడువిచ్చిందని, ఇప్పుడు ఈ వివాదం సుప్రీంకోర్టు ముందు ఉన్నందున అప్పటివరకు విచారణను వాయిదా వేయాలని కోరారు. గత 30 ఏళ్లుగా ఇవి అటవీ భూములని ఎవరూ పేర్కొనలేదన్నారు. ప్రస్తుతం ఐటీ రంగం అభివృద్ధిలో భాగంగా రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాల కోసం జరుగుతున్న పనులను అడ్డుకోవడానికేనన్నారు. పర్యావరణ సమతౌల్యానికి ఇబ్బంది ఏమీలేదని, పక్కనే 3కి.మీ. దూరంలో బొటానికల్ గార్డెన్, గోల్ఫ్‌కోర్సులు ఉన్నాయన్నారు. కౌంటరు దాఖలు చేస్తామని, అప్పటివరకు విచారణను వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఉత్తర్వులున్న నేపథ్యంలో తమకు అభ్యంతరం లేదని, అందులో తాము పార్టీలుగా లేనందున చెట్లను కొట్టివేయరాదన్న ఉత్తర్వులను కొనసాగించాలని కోరారు. చెట్లను కొట్టివేయరాదని ఈ కోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చినప్పటికీ గురువారం ఉదయం వరకూ నరికివేత కొనసాగుతూనే ఉందన్నారు.

# గచ్చీబౌలి భూములపై ప్రభుత్వానికి షాక్

- చెట్ల నరికివేతపై ధర్మాసనం సీరియస్
- చట్టాన్ని ఎలా చేతుల్లోకి తీసుకుంటారు
- ఎలాంటి పనులు చేపట్టవద్దన్న సుప్రీం ధర్మాసనం



**న్యూఢిల్లీ:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సుమోటాగా కేసు స్వీకరించిన ధర్మాసనం.. ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దంటూ స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఉన్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై జస్టిస్ గవాయ్ ధర్మాసనం సీరియస్ అయ్యింది. మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీన్ని చాలా సీరియస్ అంశంగా పరిగణించింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని జస్టిస్ గవాయ్ ధర్మాసనం ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని మండిపడింది. విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను ఉన్నత న్యాయస్థానం పరిశీలించింది. అలాగే మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు అమికస్ క్యూరీ పరమేశ్వర్ ఉంచగా.. వాటినీ పరిశీలించింది. కాగా, ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సుప్రీంకోర్టు ప్రతివాదిగా చేర్చింది. ఇంత అత్యవసరంగా భూముల్లో చెట్లు- తొలగించి పనులు చేపట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న నియమించిన కమిటీలోని అధికారులు సైతం సమాధానం చెప్పాలని హుకుం జారీ చేసింది. ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా..

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటు-ందని తెలిపింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా.. చెట్లు కొట్టేసే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.



# సచివాలయం ముట్టడికి యత్నం

హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని భూముల వివాదం నేపథ్యంలో తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాలు యత్నించాయి. ప్రభుత్వ విధానాలను తూర్పార బడుతూ నినాదాలు చేశారు. హెచ్‌సీయూ భూములను కాపాడాలంటూ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు. మరోవైపు హెచ్‌సీయూ వద్ద నిరసనలు కొనసాగుతు న్నాయి. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసనకారులు ఆందోళనకు దిగారు. లోపల జరుగుతున్న పనులను అడ్డుకుంటామన్నారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో హెచ్‌సీయూ

వద్ద ఉద్రిక్తత నెలకొంది. నిరసనల నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడ మోహరించారు.



# 400 ఎకరాల్లో చెట్ల నరికివేతపై స్టే

## సుప్రీం తీర్పు కనువిప్పు కావాలి

## మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలకు ఇది చెంపపెట్టు లాంటిది అని తెలిపారు. నిన్న పార్టీ ఫిరాయింపుల విషయంలో మొట్టికాయలు, నేడు హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం అక్షింతలు వేసిందన్నారు. అధికారం ఉంది కదా అని ఏది పడితే అది చేస్తామంటే, చట్టం చూస్తూ ఊరుకోదు అని హరీశ్‌రావు మండిపడ్డారు. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందినపుడు న్యాయస్థానం మార్గదర్శకంగా ఉండడం శుభ పరిణామం. ఇది విద్యార్థుల విజయం, పర్యావరణ ప్రేమికుల విజయం, సామాజిక వేత్తల విజయం. హెచ్‌సీయూ భూములు కాపాడుకునేందుకు ఎంతగానో పోరాటం

మిగతా 2లో

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు



**హైదరాబాద్:** హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని బిజెపి ఎంపి రఘునందన్ రావు అన్నారు. ఓవైపు విద్యార్థులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు- కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది. ఒక్క చెట్టు- కొట్టడానికే అనుమతి అవసరమైతే.. వందల చెట్లు ఎలా కొట్టారు? మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని అనుకున్న ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ వంటిదని రఘునందన్ పేర్కొన్నారు.

## థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు- థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ఇక ఈ సదస్సులో సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించనున్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

న్యూఢిల్లీ :తెలంగాణలో పార్టీ మారిన పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారంపై విచారణ పూర్తయ్యింది. సుప్రీం తీర్పును రిజర్వ్ చేసింది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై గురువారం ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఇదే అంశంపై బుధవారం కూడా సుదీర్ఘవిచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. స్పీకర్ తరఫున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గురువారం స్పీకర్ కార్యదర్శి తరఫున సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ కార్యదర్శి తరఫున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వి తెలిపారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైనదని, ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని అన్నారు. అలాగే రాణా కేసు పూర్తిగా ప్రత్యేకమైనదని, ప్రస్తుత ఆ అంశానికి సరిపోదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. దీంతో రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుని అనర్హత విధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి అని సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఇటీవల సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరఫున కూడా చెపుతున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీంతో అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ ప్రతిపక్షం నుంచి అంతకు మించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతం అని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు దిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. మేము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు పిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూసారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడివరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే నోటీసులు ఇచ్చారని గవాయ్ అన్నారు. ఈ క్రమంలో మణిపూర్ వ్యవహారం, రాణా కేసుతో పాటు మరికొన్ని అంశాలను అభిషేక్ సింఘ్వి కోర్టుకు వివరిస్తూ వాదనలు ముగించారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో.. పిటీషనర్ల తరపున కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. మహారాష్ట్ర వ్యవహారం సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్పీకర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టుకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు. సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ తప్పక తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో పేర్కొందని న్యాయవాది ఆర్యామ సుందరం
అన్నారు. జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించాక స్పీకర్ నోటీసులు ఇచ్చారని, మూడు వారాలు సమయం ఇచ్చారని, ఆ మూడు వారాల సమయం కూడా పూర్తి అయిందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. నోటీసులు పంపిన సమాచారం కూడా ప్రతిపక్ష నేతకు ఇవ్వలేదని న్యాయవాది పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రస్తావించారు. దీనిపై న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం చెప్పారు. ధర్మాసనం కూడా తాము ఆ విషయంలోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ పిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ సుప్రీంకోర్టులో ముగిసింది. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. అయితే 8 వారాల్లోగా తీర్పు ఇవ్వాలని సుప్రీం కోర్టును న్యాయవాది ఆర్యమ సుందరం కోరారు.

# వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ పచ్చజెండా

దిల్లీ: దేశవ్యాప్తంగా విస్తృత చర్చతో పాటు అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలకు దారితీసిన వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 ఎట్టకేలకు పార్లమెంటు ఆమోదం పొందింది. రాజ్యసభలో గురువారం అర్ధరాత్రి దాటే వరకూ విస్తృత చర్చ జరిగింది. విమర్శలు, ప్రతి విమర్శలతో సభ ప్రతిధ్వనించింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సమాధానం అనంతరం సవరణల వారీగా ఓటింగ్ జరిగింది. బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. బుధవారం లోక్‌సభలోనూ సుదీర్ఘ చర్చ తర్వాత ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లు... గురువారం మధ్యాహ్నం రాజ్యసభ ముందుకు వచ్చింది. ఎగువసభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చర్చ ప్రారంభించారు. కొందరు విపక్ష ఎంపీలు బిల్లుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి సభకు వచ్చారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని, ఏ ఒక్కరి మత విశ్వాసాలను దెబ్బతీయటం ప్రభుత్వం ఉద్దేశం కాదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. సంక్లిష్టతలను తొలగించి, పారదర్శకత తీసుకురావడం సహా



సాంకేతికతను ప్రవేశపెట్టడం ద్వారా వక్ఫ్ బోర్డు పనితీరు మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ బిల్లుకు మతంతో ఎలాంటి సంబంధం లేదన్నారు.
అన్నివర్గాలకు చెందిన ముస్లింలను వక్ఫ్ బోర్డులోకి తేనున్నట్లు కేంద్రమంత్రి చెప్పారు. 2004లో 4.9 లక్షలుగా ఉన్న వక్ఫ్ ఆస్తులు ఇప్పుడు 8.72 లక్షలకు పెరిగినట్లు సభ దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వాలు నెరవేర్చని లక్ష్యాల కోసమే ఈ బిల్లు తెచ్చినట్లు తెలిపారు. మద్దతివ్వాల్సిందిగా విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. ముస్లిం హక్కులను హరిస్తుందంటూ ప్రతిపక్ష నేతలు చేస్తోన్న ఆరోపణలను రిజిజు తోసిపుచ్చారు. ముస్లింలలోని షియా, సున్నీలతో పాటు ఇతర వెనుకబడిన తరగతుల వారు వక్ఫ్ బోర్డు సభ్యులుగా కొనసాగేలా కొత్త నిబంధనలు చేర్చామని చెప్పారు. 22 మంది సభ్యులతో ఏర్పడే సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ కూర్పుపై వ్యక్తమవుతున్న సందేహాలకు సమాధానమిచ్చారు. ముస్లిమేతరులు అత్యధికంగా ఉంటారనే సమస్యే ఉత్పన్నం కాదన్నారు.

కాంగ్రెస్‌పై నడ్డా ధ్వజం

కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటి హయాంలో ముస్లిం మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చాయని భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జె.పి.నడ్డా దుయ్యబట్టారు. వారి హక్కులను గుర్తించలేదని చురకలు వేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం ముమ్మారు తలాక్‌ను రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలు సగౌరవంగా జీవించేలా చేసిందని తెలిపారు. వక్ఫ్ బోర్డుల నిర్వహణలో పారదర్శకతను తీసుకొచ్చే బిల్లును తాను సమర్థిస్తున్నట్లు పేర్కొన్నారు. తుర్కియే, మలేసియా, సౌదీ అరేబియా వంటి ముస్లిం దేశాలు ప్రత్యేక చట్టాల ద్వారా వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వాల నియంత్రణలోకి తీసుకొచ్చి ప్రజలకు ఉపయోగపడేలా చేశాయని తెలిపారు.
1913-2013 మధ్య 18 లక్షల హెక్టార్ల భూమి వక్ఫ్‌ల కింద

ఉండగా 2013-2025 మధ్య కాలంలో ఆ మొత్తం 21 లక్షల హెక్టార్లకు పెరిగిందని పేర్కొన్నారు. ఆ ఆస్తులను తీసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. వాటిని దుర్వినియోగం కాకుండా చూడటమే బిల్లు లక్ష్యమని వివరించారు. మాజీ ప్రధాని, జనతా దళ్ (సెక్యులర్) అగ్రనేత హెచ్.డి.దేవేగౌడ బిల్లును సమర్థించారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షాలైన తెదేపా, జేడీయూ, శివసేన (శిందే) కూడా మద్దతిచ్చాయి.

## వైకాపా కుటిల రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి



స్వర్ణ గ్రామం పేరుతో ఉన్నతాధికారులు పల్లె నిద్ర చేయాలి అని సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి పల్లెనిద్ర, పల్లె వెలుగు, స్వర్ణ గ్రామం పేర్లు పరిశీలన చేయాలన్నారు.
ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఇచ్చే సంక్షేమ పథకాలు నాలుగు రెట్లు అధికమని చెప్పుకొచ్చారు. ఇంత చేసి సరైన ప్రచారం చేసుకోలేక పోతున్నాం అని కేబినెట్ అనంతరం సీఎం అన్నట్లు- తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్మయోగి-ట్రైనింగ్ ప్రోగ్రామ్‌పై కేబినెట్‌లో చర్చించారు. విజన్ 2047పైన మంత్రులతో చర్చించారు. శాఖలకు స్వయంప్రతిపత్తి కల్పించే దిశగా ఆప్కాస్‌ను ఎలా వినియోగించాలి, ఆప్కాస్ పైన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు- చేసే యోచనపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించినట్లు- తెలుస్తోంది. ఋషికొండ ప్యాలెస్‌ను వినియోగంలోకి ఎలా తీసుకురావాలి అనే అంశంపై చర్చించాలని తెలిపారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఋషికొండ ప్యాలెస్‌ను సందర్శించి అభిప్రాయలు చెప్పాలని మంత్రులతో ముఖ్యమంత్రి అన్నారు.

## 400 ఎకరాల్లో చెట్ల నరికివేతపై స్టే



సమాజానికి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో హైకోర్టు రిజిస్ట్రార్ మధ్యంతర నివేదికను సుప్రీంకోర్టుకు పంపింది. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ చర్యలు అన్నీ నిలిపివేయాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదిగా కోర్టు చేర్చింది. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరం ఏంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. తమ ప్రశ్నలకు సీఎస్ సమాధానం చెప్పాలని కోర్టు ఆదేశించింది. ఇది చాలా తీవ్రమైన అంశం అని జస్టిస్ గవాయ్ ధర్మాసనం పేర్కొంది. అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నెల 16న తదుపరి విచారణ చేపట్టనుంది.

## శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలి

హైదరాబాద్: శ్రీరామనవమి సందర్భంగా 6వ తేదీన నిర్వహించే శోభాయాత్రను శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. గురువారం శ్రీరామ శోభాయాత్ర కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేషన్ కమిటీకి సీపీ సీవీ ఆనంద్ కీలక సూచనలు జారీ చేశారు. తారాం భాగ్ నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని అన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు శోభాయాత్ర ప్రారంభం అయ్యేలా నిర్వహకులు చూడాలని సూచించారు. శోభాయాత్రలో పెద్దపెద్ద డీజే శబ్దాలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సీవీ ఆనంద్ సూచించారు. శోభాయాత్రలో పాటలు వేరే వర్గాలను కించ పరిచేలా ఉండకూడదని సీపీ సీవీ ఆనంద్ చెప్పారు. శోభాయాత్రలో ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరువైపులా వేదికలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జాయింట్ కంట్రోల్ రూమ్ ఐసీసీసీలో ఏర్పాటు చేసి శోభాయాత్ర తీరును పర్యవేక్షిస్తామని చెప్పారు. శోభాయాత్ర దారులు చిన్నగా ఉంటాయని.. భారీ టస్కర్ వాహనాలు వెళ్లే అవకాశం ఉండదని సీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. అందుకే టస్కర్ వాహనంతో ముందు ట్రయల్స్ నిర్వహించాలని సూచించారు. విగ్రహాల ఎత్తు కూడా చిన్నగా ఉండేలా చూసుకోవాలని సలహా ఇచ్చారు. డ్రోన్స్ ఎగుర వేయాలి అంటే ముందుగా తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు. డీజే సౌండ్‌తో అనర్థాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. శోభాయాత్రలో డీజే సౌండ్స్ తక్కువగా ఉండేలా చూడాలని అన్నారు. 24 గంటలు కరెంట్, బ్యాక్ అప్ కోసం జనరేటర్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆర్టీసీ నుంచి డ్రైవర్లు, కండక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## రాజ్యసభకు చేరిన వక్ఫ్ సవరణ బిల్లు



**న్యూఢిల్లీ:** సుదీర్ఘ చర్చ తర్వాత లోక్‌సభలో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం ఎగువసభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభించారు. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. విపక్షాల ఆరోపణలు, అధికారపక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా సాగింది. అనంతరం ఓటింగ్ పక్రియ నిర్వహించగా. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. రాజ్యసభలోనూ దీనిపై చర్చ కోసం 8 గంటలు కేటాయించారు. అవసరమైతే సమయాన్ని పెంచనున్నారు. అనంతరం ఓటింగ్ చేపడతారు. ఎగువ సభలోనూ అధికార ఎన్డీయేకు స్వల్ప ఆధిక్యం ఉండటంతో బిల్లు గట్టెక్కడం లాంఛనమే అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఉభయ సభల్లో ఆమోదం పొందిన అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారనుంది.
లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంపై నిస్సిగ్గుగా దాడి జరిగిందని అభిప్రాయపడ్డారు. గురువారం రాజ్యసభలోకి వెళ్లే ముందు సోనియాగాంధీ మీడియాతో మాట్లాడారు. సమాజంలో శాశ్వత విభజనను తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే వక్ఫ్ బిల్లును ఆమోదించినట్లు-గా వ్యాఖ్యానించారు. దిగువ సభలో బిల్లును బుల్డోజర్ చేశారని చెప్పారు. అలాగే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును కూడా రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేందుకే సభలోకి తీసుకొస్తున్నారని సోనియాగాంధీ ధ్వజమెత్తారు. మోడీ నిర్ణయాలు కారణంగా దేశం అగాధంలోకి నెట్టబడుతోందని.. ఈ నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగం కాగితంపైనే ఉంటుంది.. అందుకే దాన్ని బుల్డోజర్ చేయడమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. న్యాయం కోసం ఎంపీలంతా కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇక పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని.. తరచుగా గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. బుధవారం బిల్లుపై పార్లమెంట్‌లో వాడీవేడీగా చర్చ జరిగింది. దాదాపు 12 గంటల పాటు- అధికార-ప్రతిపక్ష సభ్యులు ప్రసంగించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బిల్లు ఆమోదం కోసం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ పడడంతో ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 282 మంది ఓటు- వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. ఇక గురువారం ఈ బిల్లు రాజ్యసభకు రానుంది. ఇక్కడ కూడా దాదాపు 8 గంటల పాటు-చర్చ జరగనుంది. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసేలా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈమేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లుప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లును గతేడాది ఆగస్టులోనే కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అప్పుడు దీనిపై విపక్షాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ- (జేపీసీ) పరిశీలనకు పంపింది. ఈ కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది.

## హద్దుల్లో ఉంటూ..పాలన సాగించాలి!

ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి పోయింది. ఎవరు అధికారంలో ఉన్నా తమకు అనుకూలమైన పనులు నెరవేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. అన్నీ రాజకీయాల చుట్టే తిరుగుతున్నాయి. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు రిజర్వ్ చేసింది. ఏం తీర్పు రాబోతోందో అన్నది సర్వత్రా ఉత్కంఠగా ఉంది. గతంలో ఉన్నట్లుగానే చట్టాలు ఉన్నాయని, కొత్తగా ఉప ఎన్నికలు రావడానికి అవకాశం లేదని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వ్యాఖ్యలు చేశారు. దీనిపైనా సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సిఎంకు నియంత్రణ లేదా అని ప్రశ్నించింది. అంటే నేతలు ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదు. ఇకపోతే బిసి రిజర్వేషన్లపై ఢిల్లీ వేదికగా మొత్తం ప్రభుత్వమే తరలి వెళ్లి ధర్నా చేసింది. సిఎం రేవంత్ సహా మంత్రులు, కాంగ్రెస్ పరివారం వెళ్లింది. నిజానికి ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరగాల్సిన వ్యవహారం. రాజ్యాంగ విలువలు, నిబంధనలతో కూడుకున్న విషయం. దీనిపై తేల్చండి అంటూ..ఢిల్లీకి వెళ్లారు. ధర్మయుద్ధం
అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన,ఇస్తున్న హామీలకు కేంద్రాన్ని బాధ్యులుగా చేసి విమర్శలు చేయడం సరికాదు. ఇకపోతే హైదరాబాద్‌కు ధీటుగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రకటించారు. అక్కడ పరిశ్రమలు, ఐటి సంస్థలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరి కొత్తగా ఇప్పుడు వివాదంలోకి వచ్చిన 400 ఎకరాల్లో ఐటి పార్కులు అభివృద్ధి చేస్తామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఓ వైపు ఆందోళనలు జరుగు తున్నా, సుప్రీం విచారణ చేస్తున్నా ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. నిజానికి ఈ 400 ఎకరాలను అర్జంటుగా అమ్మి డబ్బులు చేసుకోవాలన్న ఆత్రుత పాలకుల్లో ఉంది. ఇకపోతే బిఆర్ఎస్ నేతలు గత పాపాలను వదిలి కొత్తగా కాంగ్రెస్ మాత్రమే పాపాలు చేస్తున్నదన్న రీతిలో తెగ రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. దీంతో తమ పాపాల తాలూకు వాసనలు రాకుండా చూసుకోవాలన్న పనిలో పడ్డారు. అందుకే విపక్ష బిఆర్ఎస్ తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది.

వేగుచుక్క

# స్టాక్ వివరాల పట్టికను విధిగా ప్రదర్శించాలి.

## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 03**

: చౌక ధరల దుకాణాలలో స్టాక్ వివరాలతో కూడిన పట్టికను విధిగా ప్రదర్శించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. గురువారం ఆయన వర్ని మండలం జలాల్పూర్ గ్రామంలోని 8 వ నెంబర్ రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. మొత్తం ఎన్ని కుటుంబాలు ఆహార భద్రతా కార్డులు కలిగి ఉన్నాయి, ఇప్పటివరకు ఎంతమందికి బియ్యం పంపిణీ పూర్తయ్యింది, ఇంకా ఎంతమందికి పంపిణీ చేయాల్సి ఉంది తదితర వివరాల గురించి రేషన్ డీలర్ కాశీరాంను ప్రశ్నించి, స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. రేషన్ షాపులోని బియ్యం నిల్వలు, వాటి నాణ్యతను పరిశీలించారు. స్టాక్ వివరాల పట్టిక కనిపించకపోవడంతో కలెక్టర్ ఒకింత అసంతృప్తి వ్యక్తం



చేశారు. ప్రభుత్వం పేద కుటుంబాల వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్న నేపథ్యంలో పారదర్శకత కోసం రేషన్ దుకాణాలలో తప్పనిసరిగా స్టాక్ వివరాల పట్టికను ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ షాపులలో విధిగా దీనిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని తన వెంట ఉన్న డీఎస్ఓ అరవింద్ రెడ్డిని ఆదేశించారు. ఆయా షాపులకు ఎంత పరిమాణంలో బియ్యం నిల్వలు కేటాయించబడినాయి, ఎంత మంది కార్డులు కలిగి ఉన్నారు, ఎంత మందికి బియ్యం పంపిణీ పూర్తయ్యింది, ఇంకనూ ఎంత పరిమాణంలో బియ్యం స్టాక్ మిగిలి ఉంది తదితర అన్ని వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించేలా చూడాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు, అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్, స్థానిక అధికారులు ఉన్నారు.

# హెచ్ సీయూ భూములను కాపాడాలి.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, ఏప్రిల్ 3:**

**ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దాడులు అమానుషం.**

**బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్.**



హెచ్ సీయూ 400 ఎకరాల భూములను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని వెంటనే నిలిపి వేయాలని, ఆందోళన చేస్తున్న విద్యార్థులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దండి వెంకట్ గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములుగా వాటిని విక్రయించరాదని అన్నారు. విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర సమాజం వ్యతిరేకిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొండిగా ముందుకు వెళుతూ పోలిస్ నిర్భందంతో ఆందోళనకారులపై లాఠిచార్జ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. హెచ్ సీయూ భూములను వేలం వేసే కంటే గతంలో కేసిఆర్ ప్రభుత్వ హయాంలో వివిధ ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు కేటాయించిన భూముల్లో ఎలాంటి పరిశ్రమలు పెట్టకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినా, చేస్తున్న లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకోని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసి కులాలకు స్థానిక సంస్థలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు వెలువడినాక చట్టబద్ధత కల్పించడంలో దేశంలోనే మొట్టమొదటి రాష్ట్ర ప్రభుత్వంగా నిల్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటు బిసి సమాజం నుండి ఎస్సీ సమాజం నుండి అభినందనలు పొందుతున్న సమయంలో హెచ్ సీయూ భూములపై వేలం వేయడం, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠిచార్జ చేయడం ప్రభుత్వానికి నష్టదాకమని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం ఇందిరా గాంధీ హెచ్ సీయూ విద్యాభివృద్ధికోసం కేటాయించిన భూములను, ఇందిరమ్మ రాజ్యమని చెపుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే భూముల వివాదంలోకి వెల్లడం భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురౌతాయాని హెచ్చరించారు.

# దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ముందుకెళ్లాలి.

## - బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 03 :**

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి అందరికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టరేట్లో ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ అంకిత్ గారు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో



ఆనందంగా ఉందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు దొడ్డి కొమురయ్య పోరాట తెగువ అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సహాయ అధికారి నర్సయ్య,సి. గంగాధర్, కురుమ సంఘం పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి తొండకూరు దేవన్న,సలహాదారు మోపాల్ నరసయ్య, గంగాధర్, మోహన్, అశోక్, శ్రీనివాస్, గణేష్, మాయావర్ రాజేశ్వర్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# టియులో హెూరాహెూరీగా అధ్యాపకుల క్రీడోత్సవాలు.

**పాల్గొన్న టీయూ వైస్ ఛాన్సలర్ టి. యాదగిరి రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి.**

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, ఏప్రిల్ 3**



తెలంగాణ విశ్వవిద్యాలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం జరిగిన అధ్యాపకుల వాలీబల్ క్రీడా పోటీలలో వైస్ ఛాన్సర్ ఆచార్య టి యాదగిరిరావు "ఏ" టీంగా రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి "బి" టీం గా ఆడిన హెూరా హెూరి క్రీడలలో వైస్ ఛాన్సర్ టీమ్ గెలుపొందింది. ఈ కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల,స్పోర్ట్స్ డైరెక్టర్ డా. జీ.బాలకిషన్, వర్సిటీ పిఆర్ఓ డైరెక్టర్ డా.పున్నయ్య, డాక్టర్ నాగరాజు పాత, డాక్టర్ అబ్దుల్ కవి, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ శరత్, డాక్టర్ స్వామి, డాక్టర్ రాజేష్, రాజేష్ నేత, తదితర అధ్యాపక అధ్యాపకులు, ఇతరులు పాల్గొన్నారు.

# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి.

**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 3:**

దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాల వేసి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, బానిస బంధాల నుంచి , వెట్టి చాకిరి విముక్తి కోసం నడుం బిగించి తెలంగాణ సాయుధ పోరాటంలో వీరమరణం పొందిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. నైజాం కుట్రలతో చిందిన దొడ్డి కొమ రయ్య రక్తంతో తెలంగాణ రక్త సిక్తమైందని, బాంచెన్ దొర కాల్ మొక్తా అంటూ దొర పెత్తనంలో నలిగిన వాళ్లను బందూకులు చెత బట్టి పోరాడే దిశగా నడిపించిన ధీరుడు కొమురయ్య అని కొనియాడారు.



**దాష్టికాలను భరించలేక..**

నిజాం పాలన సమయంలో నల్గొండ జిల్లాలో భాగంగా ఉన్న కడివెండిలో పేదలు, సామాన్యుల బతుకులు, భూమి, పంట, పశు వులు, పారే నీళ్లపైనా జనాలకు హక్కులు ఉండేవి కావనీ, పటేల్, పట్వారీల దుర్మార్గాలతో ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారనీ పేర్కొన్నారు. ఈ క్రమంలో పాలకుర్తి మండలం విస్నూర్ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటాలకు కడవెండిలో నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ దాష్టికాలకు స్వస్తి పలికేందుకు పీడిత ప్రజలు ఎర్ర జెండా నీడలో పోరు బాట పట్టారు. భూమి కోసం.. భూక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం.. ఆనాడు కడవెండి లో అంకురార్పణ జరిగిన పోరాట చరిత్ర ప్రపంచంలోని పీడిత ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చింది. 19 సంవత్సరాల వయసులో 1946 జూలై 4 న గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ ఆంధ్ర మహాసభకు జై అంటూ నినాదాలు చేసే క్రమం లో కాల్పులు జరిపిన క్రమం లో ముందు వరుసలో ఉన్న కొమురయ్య పొట్టలో బుల్లెట్లు దుసుకెళ్లడంతో ఆ మహనీయుడు నేలకొరిగాడనీ అన్నారు. తెలంగాణకు స్వేచ్ఛా వాయువులు ప్రసాదించిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తిని రగిలించిన దొడ్డి కొమురయ్య అమరత్వం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ( రెవెన్యూ) విక్టర్ , అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిని స్రవంతి, సహాయ వెనుక బడిన అభివృద్ధి అధికారి చక్రధర్, నరేష్, పవన్, స్వప్న, సునీత, రాజేశ్వర్ మిగతా ఆఫీస్ సిబ్బంది గొల్ల కురుమలు సంఘ నాయ కులు, కలెక్టరేట్ సిబ్బంది, పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి.

## - పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 3:**

ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతినీ గురువారం నగరంలోని నాందేవాడ శివాజీ చౌక్ లో ఘనంగా నిర్వహించారు. శివాజీ మహారాజ్ విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ ధర్మ రక్షణ కోసం మొఘలులను ఎదిరించి, హిందూ స్వరాజ్య స్థాపనకు తన ప్రాణాలను అర్పించారని అన్నారు. శివాజీ మహారాజ్ వీరత్వానికి తల్లి జిజియా బాయ్ గొప్ప స్ఫూర్తి, చిన్నతనం నుంచే ఆయనను శత్రువులను ఎదిరించేలా తీర్చిదిద్దారని కొనియాడారు. మొఘలుల కాలంలో హిందువులను బానిసలుగా చేసి, మత మార్పిడులు బలవంతంగా జరిగించిన రోజుల్లో శివాజీ మహారాజ్ 17వ ఏటనే కత్తి చేతపట్టి జై భవాని అంటూ మొఘలులపై తిరుగుబాటు చేశారన్నారు. నేటి యువత అక్బర్, బాబర్, ఔరంగా జేబు, మొఘల్ చరిత్ర కంటే, ఛత్రపతి శివాజీ, వీరసావర్కర్, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ లాంటి మహానుభావుల చరిత్ర తెలుసుకోవాలన్నారు.

హిందూ యువత మేల్కొని హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 2048 నాటికీ హిందూ దేశంగా మార్చడానికి ప్రతి హిందూ యువకుడు ప్రతిజ్ఞ చేయాలి, ఛత్రపతి శివాజీ మహారాజ్ మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. లవ్ జిహాద్, హిందూ మతాన్ని టార్గెట్ చేసే కుట్రలను గుర్తించి, ప్రతి హిందువు తన ధర్మాన్ని పరిరక్షించాలన్నారు.

స్వామి వివేకానంద చెప్పినట్టు "ఉక్కు నరాలు, ఇనుప ఖండరాలు, వజ్ర సంకల్పం" కలిగిన యువతనే భవిష్యత్తు భారతదేశాన్ని నిర్మించగలరని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎర్రం సుదీర్, మాస్టర్ శంకర్, సంజయ్ పురోహిత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయభాషలలో ఇంగ్లీష్ ముఖ్య భూమిక.

## వైస్ ఛాన్సర్ టి యాదగిరి రావు.



**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, ఏప్రిల్ 3:**

అంతర్జాతీయభాషలలో ఇంగ్లీష్ ముఖ్య భూమిక పోషిస్తుందని టియు వైస్ ఛాన్సర్ టి. యాదగిరి రావు అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ ప్రోగ్రాంను వైస్ ఛాన్సర్ ఆచార్య టి యాదగిరిరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు మాట్లాడుతూ, సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ ప్రతిరోజు విద్యార్థులకు ఇంగ్లీషు భాష మీద శిక్షణ ఇస్తుందన్నారు. విద్యా వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఆధునిక కాలంలో ఇంగ్లీష్ విద్య వలన అనేక ప్రయోజనాలతో పాటు శక్తివంతమైన జ్ఞానాన్ని అందిస్తుందన్నారు. రోజురోజుకు ప్రపంచం గ్లోబల్ విలేజ్ గా మారడంతో ఇంగ్లీష్ భాష యొక్క ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. ఫలితంగా అంతర్జాతీయంగా విభిన్న సంస్కృతులకు, భాషలకు ఇంగ్లీష్ భాష ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ఇంగ్లీషు భాష మీద, గట్టి పట్టు సంపాదించిన వారు ప్రపంచంలో ఎక్కడైనా సుఖంగా సంతోషంగా జీవించగలరన్నారు. ఇంగ్లీషు భాష నేర్చుకోవడం వల్ల వర్తమాన కాలంలో క్రిటికల్ థింకింగ్ ప్రాబ్లం సాల్వింగ్ నైపుణ్యాలు నిర్మాణాత్మకంగా పెరుగుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి మాట్లాడుతూ, గ్రామీణ పిల్లలందరికీ సమగ్రమైన విషయ పరిజ్ఞానం ఉంటుందన్నారు. విష పరిజ్ఞానంతో పాటు ఇంగ్లీషు భాష మీద పట్టు సాధించడంతో అంతర్జాతీయ పోటీని ఎదుర్కొనవచ్చునని పేర్కొన్నారు.



# సన్నబియ్యంలో పంపిణీలో అధిక వాటా కేంద్రానిదే.

## -అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 3:**



రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీలో అధిక వాటా కేంద్రానిదేననిఅర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. నాందేవాడ మున్సిపల్ జోనల్ కార్యాలయం పక్కన 21వ రేషన్ షాప్ లో గురువారం ఎమ్మెల్యే సన్న బియ్యం పంపిణి కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, కేంద్ర ప్రభుత్వం గరీబ్ అన్న కళ్యాణ్ యోజన పథకం కింద దేశ వ్యాప్తంగా సుమారు 80 కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యం, గోధుమలు సరఫరా చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా సుమారు 96 లక్షల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కరికి 5 కిలోల బియ్యం ఉచితంగా కేంద్రమే ఇస్తుందన్నారు. హమాలీ, గోడౌన్, సెస్ అన్ని ఖర్చులు కలుపుకుంటే ఒక కిలో బియ్యం పైన సుమారు 38 రూపాయలు కేంద్రం భరిస్తుందన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి 5,800 కోట్లు నేరుగా కేంద్రమే చెల్లిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోడీ గరీబ్ అన్న కళ్యాణ్ యోజన పథకం కింద ఏ ఒక్క వలస కార్మికుడు, పేద వాడు ఆకలితో ఉండకూడదని దేశమంతా ఉచిత రేషన్ సరఫరా చేస్తున్నారని అన్నారు. కానీ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా నరేంద్ర మోడీ గారి ఫోటో రేషన్ కార్డు పైన కానీ కొనుగోలు కేంద్రాలలో పెట్టడం లేదన్నారు.

రేషన్ కార్డు పైన నరేంద్ర మోడీ గారి ఫోటో పెట్టడం వల్ల మన రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు వెళ్లే వలస కార్మికులు దేశవ్యాప్తంగా ఎక్కడైనా ఉచిత రేషన్ పొందే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ప్రతి రేషన్ కార్డు పైన నరేంద్ర మోడీ గారి ఫోటో పెట్టాలని, అలాగే ప్రతి రేషన్ షాప్ లో కూడా నరేంద్ర మోడీ గారి ఫోటో పెట్టాలని డిమాండ్ చేసారు. తెలంగాణాలో దాదాపు 30 లక్షల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి వాటిలో అర్హులైన వారందరికీ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డ్స్ మంజూరు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రేషన్ డీలర్స్ కి గౌరవ వేతనం, కమిషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ షాప్ నం. 21 (నార్త్ ) డీలర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క



## అల్లు అర్జున్ - త్రివిక్రమ్ మూవీ
## అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభం

'పుష్ప 2'లో తన మాస్ యాక్షన్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించారు అల్లు అర్జున్. ఈ చిత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో తర్వాత చేయనున్న సినిమాపై ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌పై తాజాగా నిర్మాత నాగవంశీ ఓ అప్‌డేట్ పంచుకున్నారు.

త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్ని ఓ మూవీ చేయనున్న విషయం తెలిసిందే. ఇది పూర్తిగా మైథలాజికల్ జానర్ అని నాగవంశీ అన్నారు. సోషియో ఫాంటసీ చిత్రం కాదన్నారు. పురాణాల ఆధారంగానే అన్ని సన్నివేశాలు ఉంటాయన్నారు. అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని స్పష్టం చేశారు. ఇక ఈ సినిమాలో బన్ని.. కుమారస్వామిగా కనిపించనున్నారంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. ఇప్పుడు నాగవంశీ కూడా మైథలాజికల్ జానర్ అని చెప్పడంతో బన్ని లుక్ ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎక్స్‌లోనూ ఈ హీరో కుమారస్వామిగా ఉన్న జీబ్లీ ఇమేజ్‌లు ట్రెండ్ అవుతున్నాయి.

## అజయ్ దేవగన్ మూవీలో ఐటమ్ సాంగ్...

మిల్కీ బ్యూటీ తమన్నా... ఐటమ్ సాంగ్ చేస్తే ఆ సినిమా సూపర్ హిట్ కావడం ఖాయం అనే సెంటిమెంట్ దేశ వ్యాప్తంగా నెలకొంది. తమన్నా ఏ భాషా చిత్రంలో ఐటమ్ సాంగ్ చేసినా... అది హిట్ కావడం గ్యారంటీ. రజనీకాంత్ 'జైలర్'లోనూ, 'స్త్రీ -2' సినిమాల్లోనూ తమన్నా చేసిన ఐటమ్ సాంగ్స్ ఆ మూవీ సక్సెస్ రేంజ్ ను పెంచేశాయి. దాంతో ఆమెతో ఒక్క సాంగ్ అయినా చేయించాలనే తాపత్రయం నిర్మాతలలో పెరిగిపోయింది.

తాజాగా తమన్నా భాటియా ఓ హిందీ సినిమాలో ఐటమ్ సాంగ్ కు రెడీ అయిపోయింది. అయితే... దీనిని ప్రమోషనల్ సాంగ్ గా మేకర్స్ ఉపయోగించుకో బోతున్నారు. అజయ్ దేవగన్ సరసన గతంలో 'హిమ్మత్ వాలా' హిందీ రీమేక్ లో నటించింది తమన్నా. మళ్ళీ ఇప్పుడు అజయ్ దేవ్ గన్ తాజా చిత్రం 'రైడ్ -2'లో ఆమె ఐటమ్ సాంగ్ చేయబోతోంది. ఈ పాటలో తమన్నాతో పాటు యో యో హనీసింగ్ కూడా నర్తించబోతున్నాడు. అలానే 'స్త్రీ -2' మూవీలోని తమన్నా ఐటమ్ సాంగ్ 'ఆజ్ కీ రాత్' కు కొరియోగ్రాఫర్ గా వ్యవహరించిన విజయ్ గంగూలీ దీనికి డాన్స్ మూమెంట్స్ కంపోజ్ చేస్తున్నాడు. ఇదే వారంలో రెండు రోజుల పాటు ముంబై స్టూడియో దీని చిత్రీకరణ జరుగబోతోంది. 'రైడ్ -2' మూవీలో అజయ్ దేవ్ గన్ ఐ.ఆర్.ఎస్. అధికారి అమయ్ పట్నాయక్‌గా నటించాడు. 2018లో వచ్చిన 'రైడ్' సినిమానే ఆ మధ్య రవితేజ 'మిస్టర్ బచ్చన్' పేరుతో రీమేక్ చేశాడు. ఇప్పుడీ 'రైడ్ -2' మే 1న విడుదల కాబోతోంది.





## 'కేజీయఫ్' స్థాయిలో 'కింగ్‌డమ్'..



ప్రెస్‌మీట్‌లో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' గురించి కూడా నాగవంశీ మాట్లాడారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రానున్న ఆ సినిమాలో యాక్షన్ సన్నివేశాలు 'కేజీయఫ్' స్థాయిలో ఉంటాయన్నారు. వాటికే అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆ సినిమాలో అన్ని లాజిక్‌లు ఉంటాయని.. సందేహాలన్నింటికీ గౌతమ్ తన వర్క్‌తో సమాధానమిస్తారని చెప్పారు. ఇది కచ్చితంగా హిట్ అవుతుందన్నారు. అలాగే రవితేజ హీరోగా తెరకెక్కుతున్న 'మాస్ జాతర' అనుకున్న సమయానికే రాకపోవచ్చని నాగవంశీ తెలిపారు. జులైలో ప్రేక్షకుల ముందుకు వస్తుందన్నారు.



## రియాలిటీ షోలు స్క్రిప్ట్‌లు కాదు..


ఓ ఇంటర్వ్యూలో మలైకా అరోరా రియాలిటీ షోల గురించి మాట్లాడారు. ఆ కార్యక్రమాలు మొత్తం స్క్రిప్ట్ ప్రకారం జరుగుతాయంటూ వస్తోన్న వార్తలపై స్పందించారు. కంటెస్టెంట్‌లు ప్రదర్శించే డ్యాన్స్ ఆధారంగానే జడ్జిమెంట్ ఇస్తామని పేర్కొన్నారు. "బయట నుంచి చూసే వారికి ఆ కార్యక్రమం మొత్తం స్క్రిప్ట్‌లా అనిపించడంలో తప్పులేదు.. ఎందుకంటే కొన్నిసార్లు డ్రామా ఆ స్థాయిలోనే ఉంటుంది. అక్కడ జరిగేవి ఒక్కోసారి న్యాయనిర్ణేతలకు చికాకు తెప్పిస్తాయి కూడా..! కానీ, ఆ పోటీలన్నీ న్యాయంగానే జరుగుతాయి" అని వెల్లడించారు.



## మెగా 157.. గ్యాంగ్ ఇదే!

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. 'మెగా 157' పేరుతో ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా కోసం వర్క్ చేయనున్న వారి వివరాలను పంచుకుంటూ టీమ్ ఓ ప్రత్యేక వీడియో విడుదల చేసింది. అందులో ఇప్పటి వరకూ చిరంజీవి నటించిన సినిమాల్లోని పాత్రలను చెబుతూ ఒక్కొక్కరు వారు చేయనున్న వర్క్‌ను వివరించారు. 2026 సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు. 'ఈ సంక్రాంతికి రఫ్ఫాడించేద్దాం' అంటూ వీడియో చివర్లో చిరంజీవి చెప్పిన డైలాగ్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.

## గంగూలీ బయోపిక్.. త్వరలోనే షూటింగ్ ప్రారంభం !



ప్రముఖ క్రికెటర్, టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ జీవితం త్వరలో వెండితెరపైకి రానున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ హీరో రాజ్‌కుమార్ రావు ఇందులో గంగూలీగా కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విక్రమాదిత్య మోత్వానే దర్శకత్వంలో రానున్న ఈ సినిమాను లవ్ రంజన్ నిర్మించనున్నారు. ఈ బయోపిక్‌ను భిన్నంగా రూపొందించాలని దర్శకనిర్మాతలు భావిస్తున్నారట. ప్రస్తుతం దీని ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి. తొలి షెడ్యూల్ రెండు నెలలు ఉంటుందని టాక్. ఇప్పటికే ఈ షెడ్యూల్‌కు సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాయని సమాచారం.